### సంఘాలను ప్రగతిపథంలోకి తీసుకెళ్లొచ్చు



సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లోనూ మహిళలకు పెద్ద పీట వేశారు. అంతేకాకుండా రానున్న ఎన్నికల్లో గెలిచిన వెంటనే మహిళా సమాఖ్య సంఘాలకు సొంత భవనాలను నిర్మిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించడం చాలా సంతోషకరం. భవనాల నిర్మాణంతో సభ్యులందరూ కలిసి సమావేశాలు నిర్వహించుకునే వీలు కలుగుతుంది. సంఘాలను మరింత ప్రగతిపథంలోకి తీసుకెళ్లొచ్చు.

**-అనంతమ్మ, అగ్గనూర్, యాలాల**

### మహిళలంతా సీఎం వెంటే ఉంటారు..



మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక భవనాలను నిర్మిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. అన్ని వర్గాల వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఆయన వివిధ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. మహిళలంతా ఆయన వెంటే ఉంటారు.

**-అంజమ్మ, పాత బ్రాహ్మణపల్లి, మాడ్గుల**

### మహిళల అభివృద్ధికి తోడ్పాటు



సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు మూడోసారి అధికారంలోకి రాగానే మహిళా సమాఖ్యలకు దశలవారీగా సొంత భవనాలను నిర్మిస్తే.. ఆ భవనాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులు సంఘాల పురోభివృద్ధికి సమావేశాలు నిర్వహించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. మహిళలకు అండగా ఉంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మహిళలు ఓటు గెలిపిస్తారు.

**-లక్ష్మి ఎన్కతల, మోమిన్‌పేట**

### భవనాలు నిర్మించడం సంతోషకరం



ఎన్నికల్లో గెలిచిన వెంటనే మహిళా సమాఖ్య సంఘాల సభ్యులకు దశలవారీగా భవనాలను నిర్మిస్తామని సీఎం కేసీఆర్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించడం చాలా సంతోషకరం. భవనాలను నిర్మిస్తే ఎంతో ప్రయోజనంగా ఉంటుంది. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకునేందుకు వెసులుబాటుగా ఉంటుంది. బుక్ కీపర్లు, గ్రామ అధ్యక్షురాలితోపాటు సభ్యులు నెలవారిగా అక్కడే డబ్బులను జమచేయడం, లెక్కలు రాయడం, రుణాల డబ్బులను తిరిగి సేకరించడానికి ఈ భవనాలు ఎంతో దోహదపడుతాయి.

**–మక్కపల్లి జ్యోతి, మేడిపల్లి నక్కర్త యాచారం**

### సభ్యులకు ఇబ్బందులుండవు



బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఎన్నికల్లో గెలిచిన వెంటనే సొంతభవనాలు నిర్మిస్తామని ప్రకటించడం అభినందనీయం. చాలా గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సమావేశాల నిర్వహణకు భవనాలు లేక చెట్ల కింద, కమ్యూనిటీ భవనాలు, పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. సొంత భవనాలను నిర్మించడం ద్వారా సభ్యులకు ఇబ్బందులుండవు.

**-వెంకటమ్మ, ఎంపీటీసీ, మహిళా సంఘం సభ్యురాలు, ఘనాపూర్ కులకచర్ల**

### అండగా ఉంటూ.. ఆదరిస్తున్నారు



మహిళల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి ఎనలేనిది. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారు. తక్కువ వడ్డీకే రుణాలను అందించి ఆదుకుంటున్నారు. అంతేకాకుండా వివిధ అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి మెళకువలు నేర్పిస్తున్నారు. మహిళలకు నీడలా ఉండి ముందుకు నడిపిస్తున్నా సీఎం కేసీఆర్‌కే మహిళలంతా అండగా ఉండి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తారు.

**-అశ్విని దొంతాన్‌పల్లి గ్రామం, శంకర్‌పల్లి మండలం**





# మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు

## రంగారెడ్డి జిల్లాలో 788 గ్రామ మహిళా సమాఖ్యలు

- మహిళా సమాఖ్య సంఘాలకు సొంత భవనాల నిర్ణయాలపై స్వయం సహాయక సంఘాల సభ్యుల హర్షం
- గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక వృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద ఎస్‌హెచ్‌జీలకు రూ.వేల కోట్ల రుణాలు
- ఏటా లక్ష్యానికి మించి ఎస్‌హెచ్‌జీలకు రుణాల మంజూరు
- స్వయం ఉపాధి కోసం రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు

రంగారెడ్డి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మహిళా సంఘాల స్వయం సమృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఇతోధికంగా చేయూత అందిస్తున్నది. సంఘాల ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తూ మహిళల ఆదాయాభివృద్ధికి అవకాశాలు కల్పిస్తున్నది. వారికి ఆర్థిక భరోసానూ అందిస్తూ వ్యాపార, వ్యవసాయ తదితర అవసరాలకు రుణాలను అందిస్తూ అండగా నిలుస్తున్నది. స్వయం సహాయక సంఘాలకు సహాయకులుగా పనిచేస్తున్న వీవోఏల వేతనాలను సైతం ఇటీవల గణనీయంగా పెంచింది. ఈ నేపథ్యంలోనే స్వయం సహాయక మహిళా సమాఖ్యలకు సొంత భవనాలను నిర్మిస్తామని సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడంతో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### మహిళా సంఘాలకు ఇతోధికంగా చేయూత..

మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రతి ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా సంఘాలకు రుణాలు అందించి స్వావలంబనకు తోడ్పాటునందిస్తున్నది. సభ్యుల ఆర్థిక అవసరాల మేరకు వ్యవసాయ, అనుబంధ రంగాలు, కిరాణాషాపులు, పిండిగిర్నీ, టైలరింగ్, బ్యూటీపార్లర్, ఫుట్‌వేర్ తదితర వ్యాపారాలకు రుణాలను అందిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన సంఘాలు ఆరు నెలలు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే వారికి కూడా విరివిగా రుణాలను అందజేస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.50వేల నుంచి రూ.5లక్షల లోపునే మహిళా సంఘాలకు రుణం ఇచ్చేవారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మాత్రం రూ.లక్ష నుంచి రూ.20లక్షల వరకు అర్హతను బట్టి రుణాలను మంజూరు చేస్తున్నది. 2022-23లో 12,061 సంఘాలకు రూ.811కోట్ల రుణాలను అందజేశారు. 2023-24 సంవత్సరానికి 12,989 సంఘాలకు రుణం ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఈ ఏడాది జూలైనాటికి 2,085 సంఘాలకు రూ.2.66కోట్ల రుణాలను అందజేశారు. గడిచిన తొమ్మిదేండ్లలో ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 3,588 కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అందజేసింది. స్త్రీ నిధి ద్వారా2022-23లో రూ.100.43కోట్ల లక్ష్యాన్ని పెట్టుకుని రూ. 73.48కోట్లను అందజేసింది. 2023-24 సంవత్సరానికి రూ. 112కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా..ఇప్పటివరకు రూ.3.88కోట్ల రుణాలను పంపిణీ చేసింది.

### వీవోఏల వేతనం రూ.8వేలకు పెంపు..

ఉమ్మడి రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు సహాయకులుగా పనిచేసిన వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు)ల వేతనాలు అరకొరగానే ఉ డేవి. సంఘాలకు సంబంధించిన ఆర్థిక అంశాలు, ఇతర సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేసినందుకు ఆయా మహిళా సంఘాల నుంచి గౌరవ వేతనంగా రూ.3వేలు మాత్రమే అందేది. స్వరాష్ట్రంలో వీవోఏ సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ 2016 నుంచి నెలకు రూ.3వేల వేతనాన్ని అందజేస్తూ వచ్చారు. దీంతో అన్నీ కలిపి రూ.6వేల వేతనం వచ్చేది. 2021లో గౌరవ భృతిని ప్రభుత్వం 30శాతం పెంచడంతో వీవోఏల వేతనం రూ.6,900 అయ్యింది. వేతనం పెంపుపై వీవోఏల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న సీఎం కేసీఆర్ మరోసారి వేతనాన్ని పెంచి ఆదుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ ఏడాది రాఖీ పండుగ కానుకగా రూ. 1,100 వేతనాన్ని పెంచారు. రెండేండ్ల వ్యవధిలోనే ప్రభుత్వం వీవోఏల వేతనాన్ని రూ.2వేలు పెంచగా..ప్రస్తుతం వీవోఏల మొత్తం వేతనం రూ. 8వేలకు చేరింది. జిల్లాలో 753 మంది వీవోఏలుగా పనిచేస్తుండగా.. ప్రభుత్వం కల్పించిన భరోసాతో ఆయా కుటుంబాలు సంతోషంగా ఉన్నాయి.

### దశల వారీగా సొంత భవనాలు..

జిల్లాలో ఒక జిల్లా సమాఖ్య ఉండగా.. మండల సమాఖ్యలు 21 ఉన్నాయి. 788 గ్రామ సమాఖ్యలున్నాయి. జిల్లావ్యాప్తంగా 19,192 స్వయం సహాయక సంఘాలుండగా.. వీటిలో 2,06, 691 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. జిల్లా, మండల స్థాయిల్లో చాలావరకు సమాఖ్య భవనాలను ప్రభుత్వం ఇప్పటికే సమకూర్చింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల చొరవతో గ్రా మ సమాఖ్యలకు సైతం కొన్నిచోట్ల భవనాలున్నాయి. ప్రతినెలా రెండు పర్యాయాలు సమావేశాలు నిర్వహించి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు, రుణ వాయిదాల వసూళ్లపై మహిళా సంఘాల తో చర్చిస్తుంటారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే దశలవారీగా సమాఖ్యలకు భవనాలను నిర్మిస్తామని సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో ప్రకటించారు. పొదుపు సంఘాలను నడిపించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న మహిళా సమాఖ్యలకు భవనాలు సమకూరనుండడంతో ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. చెట్ల కింద, అద్దె భవనాల్లో నిర్వహించే సమావేశాల నుంచి విముక్తి కానున్నదని వారు పేర్కొంటున్నారు.

### మ్యానిఫెస్టో చాలా బాగున్నది..



సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చాలా బాగున్నది. కేసీఆర్ మాట ఇచ్చాడంటే కచ్చితంగా నెరవేర్చుతారు. మహిళా సమాఖ్య గ్రూపులకు సొంత భవనాలను దశలవారీగా నిర్మిస్తామని ప్రకటించడం శుభపరిణామం. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నది.

**-కవిత, మహిళా సంఘం అధ్యక్షురాలు, ఎన్కేపల్లి, చేవెళ్ల**

### సీఎం కేసీఆర్‌కే నా మద్దతు



సీఎం కేసీఆర్ పాలనలో మహిళలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నారు. గత ఉమ్మడి ప్రభుత్వాల పాలకులు మహిళల అభ్యున్నతికి ఎలాంటి కృషి చేయలేదు.బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో మహిళా సమాఖ్యలకు సొంత భవనాలను నిర్మిస్తామని ప్రకటించడం హర్షనీయం. మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కే నా మద్దతు.

**-కందికంటి లావణ్య, కడ్తాల్**

### మహిళలమంతా సీఎంకు రుణపడి ఉంటాం



సీఎం కేసీఆర్ మహిళల అభ్యున్నతి కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారు. వడ్డీ లేని రుణాలను అందించి ఆర్థికాభివృద్ధికి చేయూత అందిస్తున్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామని సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం గొప్ప పరిణామం. మహిళల కోసం పథకాలను అమలు చేస్తున్న సీఎంకు రుణపడి ఉంటాం.

**-రావుల లక్ష్మి, నాగరగూడ, షాబాద్**

### సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు



సీఎం కేసీఆర్ ప్రతి పథకాన్నీ మహిళల పేరుతో ప్రారంభించడం శుభపరిణామం. మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు మహిళా సమాఖ్య సంఘాలకు ప్రత్యేక భవనాలను నిర్మిస్తే సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉంటుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాతే మహిళలు తలెత్తుకుని జీవిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలుచేస్తున్న పథకాలే భారీ మెజార్టీతో గెలిపిస్తాయి.

**-బసమ్మ, గ్రామం అగ్గనూర్, యాలాల**



# ఐటీ కారిడార్‌లో..
# పోటీకి భయం

- అయోమయంలో ప్రతిపక్ష పార్టీలు
- అభ్యర్థులను ప్రకటించలేక సతమతం
- కొత్త వారొస్తారేమోనని ఆశావహుల ఆందోళన



సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : అధికార పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకువెళుతుంటే... ప్రతిపక్ష పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహుల్లో అయోమయం నెలకొంది. తాజాగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే... ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న వారిని కాదని... కొత్త వారికి టికెట్లు ఖరారు చేస్తుండడంతో ఆశావహులు కంగుతింటున్నారు. ఐటీ కారిడార్‌లో అత్యంత కీలకమైన అసెంబ్లీ నియోజకవర్గాలుగా పేరున్న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లలో ఇప్పటికీ పోటీ చేసే అభ్యర్థులు ఎవరో ఆయా పార్టీలు ప్రకటించలేదు. కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికే మొదటి లిస్టును ప్రకటించినా... అందులో ఈ రెండు నియోజకవర్గాల నుంచి అభ్యర్థులను ప్రకటించకపోవడం ఆశావహులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీలో ఉంటూ ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఆశతో ఎదురు చూస్తున్న వారు నిరాశతో ఉన్నారు. దీనికి కారణం... ఇటీవల కాలంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఏకంగా టికెట్లు కేటాయిస్తుండడమే. మల్కాజిగిరి ఎమెల్యేకు కాంగ్రెస్ పార్టీలో ఒకేసారి రెండు టికెట్లను కేటాయించడాన్ని స్థానిక నాయకులు ఊహించుకొని ఆందోళనకు గురవుతున్న పరిస్థితి ఈ రెండు నియోజకవర్గాల్లో నెలకొంది. మరో వైపు ఒక్కో నియోజకవర్గంలో 3 నుంచి 5 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిని కాదని కొత్తగా నాయకులు పార్టీలోకి వచ్చే అవకాశాలు ఉండడంతో టికెట్ దక్కుతుందో లేదోనన్న భయం వారిని వెంటాడుతోంది.

### అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గాలు...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఐటీ కారిడార్‌లో అత్యంత కీలకమైనవే కాకుండా అత్యధిక ఓటర్లు ఉన్న నియోజక వర్గాలుగా గుర్తింపు పొందాయి. మెజారిటీ ఓటర్లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సెటిల్ అయిన వారు ఉండగా, ఇందులో ఐటీ ఉద్యోగులు, ఉత్తర భారత దేశానికి చెందిన వారు చాలా మందే ఉన్నారు. ఇలాంటి చోట ఓటర్ల ఆలోచన ఎలా ఉంటుందో తెలియక ప్రతిపక్ష పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న వారు సతమతమవుతున్నారు. అదేసమయంలో శేరిలింగంపల్లి నుంచి అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థిగా, సిట్టింగ్ ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ, రాజేంద్రనగర్ నుంచి ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌లు ఐటీ కారిడార్‌లో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెబుతూ ప్రజల్లో తిరుగుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే ప్రత్యర్థి పార్టీలకు అందనంత వేగంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరవుతూ ఉంటే... కాంగ్రెస్, బీజేపీల నుంచి అభ్యర్థులెవరో తెలియని ఆయా పార్టీల క్యాడర్‌లో నెలకొంది.

### అభివృద్ధి అంటేనే ఐటీ కారిడార్...

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ కేంద్రంగా జరిగిన అభివృద్ధిని చూస్తే అత్యధికంగా ఐటీ కారిడార్ పరిధిలోనే జరిగింది. ఈవిషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు. కొత్తగా వందలాది ఐటీ కంపెనీలతో పాటు ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, లింకురోడ్లు, తాగునీరు, విద్యుత్... ఇలా ఎన్నో అంశాల్లో అభివృద్ధి ఐటీ కారిడార్ ఎక్కువ జరగడంతో అధికార పార్టీపై ప్రజల్లో ఎంతో సానుకూలత ఉంది. అలాంటి చోట తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న ఆలోచన ఒకవైపు ఉంటే... టికెట్ ఎప్పుడు ఎవరికి ఇస్తారో అన్న దానిపైనే ఎక్కువగా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల గడువు సమీపిస్తున్నా టికెట్లు ఖరారు కాకపోవడం ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు ప్రతికూలంగా మారతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఖరారైన తర్వాత ప్రజల వద్దకు వెళ్లేందుకు సరిపడా సమయం లేకపోతే గెలుపు అంత సులువు కాదనే అభిప్రాయం ఆయా పార్టీల నాయకుల నుంచే వ్యక్తమవుతోంది.